క్లుప్తంగా

పోస్ట్ కార్డు ఉద్యమం

భద్రాచలంఅర్బన్: అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని, జర్నలిస్టుల కుటుంబాలకు హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరుతూ.. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) భద్రాచలం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర నాయకుడు బీవీ.రమణారెడ్డి మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మొబగాపు ఆనంద్ కుమార్, డివిజన్ అధ్యక్షులు తోకల నాగేశ్వరావు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు పోకల శ్రీనివాస్, జిల్లా నాయకులు పిల్లి రాజు, క్రాంతి కుమార్, లక్ష్మీ నరసింహా నాయుడు, జగన్ పాల్గొన్నారు.

బియ్యం వితరణ

మణుగూరురూరల్: మండలంలోని సీటైప్ ప్రాంతంలోని బాలవెలుగు ప్రత్యేక పాఠశాలకు టీసీ-4 ఈపీ ఆపరేటర్, ఏఐటీయూసీ నాయకులు నంబూరి శ్రీనివాస్ తన భార్య అనురాధ వర్ధంతి సందర్భంగా బుధవారం మూడు క్వింటాల బియ్యాన్ని వితరణగా అందజేశారు. అనంతరం విద్యార్థులకు సహపంక్తి భోజనాన్ని ఏర్పాటు చేశారు. చిన్నారులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. సింగరేణి సేవా సమితి సభ్యులు నాసర్‌పాషా, మాజీ ఉద్యోగి సీహెచ్ వెంకటేశ్వరరావు, పాఠశాల నిర్వాహకులు బి.జగన్మోహన్ రెడ్డి, సిబ్బంది సుహాసిని, దేవి, దుర్గాబాయ్, రాధ పాల్గొన్నారు.

ఆయిల్‌పాంకు ప్రోత్సాహం

కరకగూడెం: ఆయిల్‌పాం సాగు చేసే రైతులను రాష్ట్రప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, జిల్లా ఉద్యాన, పరిశ్రమశాఖ అధికారి జినుగు మరియన్నలు తెలిపారు. మండలంలోని కుర్నవల్లిలో విప్ రేగా వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ తోటను బుధవారం వారు పరిశీలించి మాట్లాడారు. మణుగూరు ఏడీఏ తాతారావు, ఆయిల్‌ఫెడ్ డివిజనల్ అధికారి ఆకుల బాలకృష్ణ, ఉద్యానశాఖ అధికారి శాంతిప్రియ, ఆయిల్‌ఫెడ్ అధికారి అప్పారావు, ఏఈఓలు ప్రశాంత్, అనిల్ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

గుండాల: గత మూడు సంవత్సరాల క్రితం వివిధ పాఠశాలల్లో పని చేసిన విద్యావాలంటీర్లకు సంబంధించి మూడు నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వలంటీర్ల వేతనాలు రాకపోవడంతో వారు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మాజీ సైనికులకు సన్మానం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని రెడ్‌క్రాస్ భవనంలో బుధవారం కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా ఆర్మీలో విధులు నిర్వహించి, యుద్ధంలో పాల్గొన్న జవాన్లు వెంకన్న యాదవ్, జకరయ్య, బెల్లంకొండ రమేష్, ఎక్కే నభి బెన్షర్, సైనిక వెల్ఫేర్ బోర్డు మెంబర్ తిప్పన సిద్ధులను లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు భీమవరపు వెంకటరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ సూర్యనారాయణ, క్లబ్ కార్యదర్శి గుండు శరత్, కోశాధికారి భరత్‌కుమార్, పాస్ట్ ప్రెసిడెంట్ సోమరౌతు శ్రీనివాస్, బిల్లిపల్లి రంగారెడ్డి, బోనాల సూర్యనారాయణ, సిద్ధారెడ్డి, ఉమా శంకర్ నాయుడు, కొల్లు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: స్థానిక వ్యవసాయ కళాశాలలో బుధవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మాజీ ఆర్మీ జవాన్లను ఘనంగా సత్కరించారు. కార్గిల్ విజయ్ దివాస్‌ను పురస్కరించుకుని కళాశాలలో 'మేరి మిట్టి, మేర దేశ్'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మీలో 15 ఏళ్లు సేవలు అందించి పదవీ విరమణ పొందిన అశ్వారావుపేటకు చెందిన నలుగురు జవాన్లు రాజారావు, హమీద్, ఇజ్రాయేల్, అర్జున్ సింగ్‌లను శాలువా కప్పి సన్మానించి, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ అసోసియేట్ డీన్ డాక్టర్ ఐవీ శ్రీనివాసరెడ్డి, ప్రొఫెసర్లు గోపాలకృష్ణమూర్తి, కృష్ణతేజ, పావని, రాంప్రసాద్, నీలిమ, జంబమ్మ, స్రవంతి,రెహ్మాన్, కడసిద్దప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

'పోడు'కు పట్టాలివ్వాలి

ములకలపల్లి: పోడు సాగుదారులందరికీ హక్కుపత్రాలివ్వాలని జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని మంగలిగుట్ట గ్రామాన్ని సందర్శించిన ఆమె.. సాగుదారులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన 73 మంది రైతులకు పోడు పట్టాలు రాకపోవడం దారుణమన్నారు. పుప్పాల హనుమంతు, వీరస్వామి, కోండ్రు బాబూరావు, కోండ్రు శ్రీకాంత్, బాలరాజు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

చండ్రుగొండ: మండలంలోని అయన్నపాలెం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ ఎస్కే గాలీబ్ (32) అదృశ్యం అయినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గొల్లపల్లి విజయలక్ష్మి బుధవారం రాత్రి తెలిపారు. గాలీబ్ మద్యం మత్తులో భార్యతో గొడవ పడి ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లాడు. సాయంత్రం సీతాయిగూడెం గ్రామ సమీపంలోని వాగు చప్టా వద్ద అతడి ద్విచక్రవాహనంతోపాటు చెప్పులు కన్పించాయి. తండ్రి అక్బర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎడతెగని జోరువాన

నియోజకవర్గాల్లోని దాదాపు అన్ని ప్రాంతాల్లో బుధవారం వర్షం ఎడతెరిపి లేకుండా కురిసింది. వరద పోటెత్తడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కొన్ని గ్రామాలు జలదిగ్బంధనంలో ఉండిపోయాయి. ఆ గ్రామాలు బాహ్య ప్రపంచానికి దూరమై స్థానికులు నానా అవస్థలు పడ్డారు. మరికొన్నిచోట్ల నివాస గృహాల్లోని భారీగా వరద నీరు చేరుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు పంటపొలాలు సైతం జలమయం అయ్యాయి. పట్టణాల్లో రోడ్లమీదకి వరద చేరి చెరువులను తలపిస్తున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వాపురం: తుమ్మలచెరువు వద్ద రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న లోతువాగు



మణుగూరురూరల్: సురక్షా బస్టాండ్ ప్రాంతంలో చెరువును తలపిస్తున్న ప్రధాన రహదారి



బూర్గంపాడు వద్ద నీట మునిగిన పంటచేలు



అన్నపురెడ్డిపల్లి: సత్తుపల్లి-అన్నపురెడ్డిపల్లి ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు



దుమ్ముగూడెం: పర్ణశాల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



అశ్వాపురం: బట్టీలగుంపులో నేలమట్టమైన పూరిల్లు



కరకగూడెం: నీట మునిగిన వైకుంఠధామం



గుండాల: అలుగు వద్ద చేపలు పడుతున్న స్థానికులు



పినపాక: మల్లారం గ్రామంలో ఇంట్లోకి చేరిన వరద నీటిని ఎత్తిపోస్తున్న స్థానికుడు



పినపాక: పోతిరెడ్డిపల్లి గ్రామంలో చెరువును తలపిస్తున్న పంటచేలు



దుమ్ముగూడెం: బుర్రవేముల వద్ద చర్ల-భద్రాచలం ప్రధాన రహదారి..



చండ్రుగొండ: గంటే వీరయ్యకుంట అలుగు వద్ద స్థానికుల చేపల వేట..

పునరావాస కేంద్రాలకు తరలింపు

చర్ల: మండలంలోని గోదావరి వరద ముంపు ప్రభావిత గ్రామాలకు చెందిన ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. మండలంలోని దండుపేటకు చెందిన 48 కుటుంబాల వారిని రాళ్లగూడెంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి, కుదునూరుకు చెందిన నాలుగు కుటుంబాల వారిని కుదునూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని పునరావాస కేంద్రాలకు తరిలించారు. వరద ఉధృతి మరింతగా పెరుగుతున్న కారణంగా దేవరాపల్లి, తేగడ, లింగాపురం, కొత్తపల్లి, వీరాపురం, జీపీపల్లి, ఆంజనేయపురం తదితర గ్రామాల ప్రజలను రెవెన్యూ, పోలీసుశాఖల అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు, సెక్టోరియల్ ఆఫీసర్ సుధాకర్, తహసీల్దార్ బి.భరణిబాబు, పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.అశోక్ ఆయా ముంపు ప్రభావిత గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



ముంపు గ్రామంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పాలి

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగిస్తూ, ఎన్నికల హామీలను విస్మరించిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పాలని టీపీసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కన్నాయిగూడెం, కొత్త కన్నాయిగూడెం, గోపన్నగూడెం, కావడిగుండ్ల, కొత్త కావడిగుండ్ల, చెన్నాపురం గిరిజన గ్రామాల్లో ఆయన బుధవారం జోరు వానలో విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో కాలినడకన ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు జరిగే మేలు, సంక్షేమ పథకాలు, రైతు డిక్లరేషన్ గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలే చరమగీతం పాడుతారని అన్నారు. సర్పంచ్ దాసరి నాగేంద్రరావు, నాయకులు సుంకవల్లి వీరభద్రరావు, జ్యేష్ట సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పొట్టా రాజులు, వెంకటస్వామి, బీ రామారావు, ఆకిరిపల్లి రాంబాబు, తమ్మిశెట్టి పోశయ్య, ఎస్‌కే బషీర్, కోడూరి శ్రీనివాస్, పెన్మత్స రాజు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు చేపట్టాలి

దుమ్ముగూడెం: గోదావరి వరద ముంపు గ్రామాల విషయంలో ముందస్తు చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం మండల కమిటీ సమావేశాన్ని జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... భారీ వర్షాల వల్ల ముంపునకు గురయ్యే గ్రామాల వారందరికీ పునరవాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మాజీ డీసీసీబీ చైర్మన్ యలమంచి రవికుమార్, సీపీఎం భద్రాచలం నియోజవర్గ కోకన్వీనర్ కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, కొర్సా చిలకమ్మ, నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, యలమంచి శ్రీనుబాబు, కొడాలి లోకేష్, మర్మం సమ్మక్క, వాగే ఖాదర్ బాబు, బొల్లి సత్యనారాయణ, కొమరం చంటి, మడకం మహేంద్రనాథ్, సోయం వీర్రాజు, కుమారి కుంట్ల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని పరిశీలించిన సీఐ



బాలుర వసతి గృహాన్ని సందర్శిస్తున్న సీఐ ముత్యం రమేష్

మణుగూరురూరల్: భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ అశోక్‌నగర్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మణుగూరు సీఐ ముత్యం రమేష్ బుధవారం సందర్శించి పరిశీలించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎస్సీ బాలుర వసతి గృహం చుట్టూ వరదనీరు భారీగా చేరింది. ఈ విషయం తెలుసుకున్న సీఐ ముత్యం రమేష వసతిగృహానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. భారీ వర్షాలు కురుస్తున్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే మండల పరిధిలోని గోదావరినది వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు. గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నందున ముంపు గ్రామాల ప్రజలు వెంటనే పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. వర్షాలకు తడిసిన విద్యుత్ స్తంభాలను తాకొద్దని, తడిసిన చేతులతో స్విచ్‌లు వేయరాదని, కరెంట్ తీగలు ముట్టుకోవద్దని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసులకు కానీ, స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దుమ్ముగూడెం: రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరభద్రం, డివిజన్ ఇన్‌చార్జ్ భూపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు, ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్, గురుకులాలు, కేజీబీవీలలో నెలకొన్న సమస్యలను తెలుసుకోడానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్ర రెండో రోజైన బుధవారం మండలానికి చేరింది. మండలంలోని కేజీబీ, ఆశ్రమ హాస్టళ్లు, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్లు విడుదల చేయాలని, సంక్షేమ హాస్టల్లో, ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ధరలకు అనుకూలంగా మెనూ చార్జీలు పెంచాలని అలాగే జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు నాలుగు జతల దుస్తులను అందించాలని, పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ పూర్తిస్థాయిలో అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పవన్, ఉపాధ్యక్షుడు అభిమన్యు, మండల కమిటీ సభ్యులు నగకృష్ణ, రామ్ చరణ్, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం, నారాయణపురం సబ్ స్టేషన్ల పరిధిలో నేడు (గురువారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. వినాయకపురం సబ్ స్టేషన్‌లో ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల దాకా విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి

దమ్మపేట: మండల పరిధిలోని పంచాయతీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బుధవారం పంచాయతీ కార్మికులు, ఉద్యోగ పరమైన హక్కులను తీర్చాలని డిమాండ్ చేస్తూ, తహసీల్ ఎదుట నిరసన చేపట్టిన అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. గత 21 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం శోచనీయమని అన్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఉన్నత అధికారులకు, కార్మికుల సమస్యలను తెలియజేయాలని విన్నవించారు. తమ హక్కులను నెరవేర్చని పక్షంలో ప్రగతి భవనం ముట్టడికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బసవయ్య, రాంబాబు, అన్నవరం, సింగ్, జయలక్ష్మి, నరసమ్మ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై శాంతి ర్యాలీ

అశ్వారావుపేటరూరల్: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై లైంగిక దాడి, హత్య చేసిన నింధితులను తక్షణమే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక రింగ్ రోడ్ సెంటర్, బస్టాండ్ సెంటర్, జంగారెడ్డిగూడెం రోడ్లలో ఈ ర్యాలీ నిర్వహించి, మణిపూర్ ఘటనలను తీవ్రంగా ఖండిచారు. కార్యక్రమంలో మండలంలోని పాస్టర్లు, పలువురు క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

దివ్యాంగుల పాఠశాలలో అన్నదానం

భద్రాచలం: భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య కుమారుడు, యువజన కాంగ్రెస్ నాయకుడు పొదెం మధుచంద్ర జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా జరిపారు. అందులో భాగంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణంలోని వికాస దివ్యాంగుల పాఠశాలలో కేక్ కట్ చేశారు. చిన్నారులకు అన్నదానం ఎమ్మెల్యే పొదెం వీరయ్య చేతుల మీదుగా జరిపించారు. చిన్నారుల చెంతన ఈ పుట్టిన రోజు వేడుకలను జరపటం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సరెళ్ల నరేష్, టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, నల్లపు దుర్గాప్రసాద్‌లు, నాయకులు చింతిరేల రవికుమార్, అడబాల వెంకటేశ్వరరావు, బోగాల శ్రీనివాస్ రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ తరుణ్‌మిత్ర, సుధీర్, ప్రదీప్, సరెళ్ల వెంకటేష్, రాము, మహిళ కాంగ్రెస్ తరుపున సరిత, హసీనా, వసీమ, ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: భద్రాచలం ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు పొదెం వీరయ్య కుమారుడు, కాంగ్రెస్ యువ నేత పొదెం మధు చంద్ర జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మధు చంద్ర జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటిబోయిన నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్‌లు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అలాగే భద్రాచలం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మధుచంద్రతో పుట్టినరోజు కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కోర్సా ఆనంద్, లతీఫ్, గుండాల శివ, నాగరాజు, వంశీ పాల్గొన్నారు.



చిన్నారులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వీరయ్య, ఆయన కుమారుడు మధుచంద్ర

ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

మణుగూరురూరల్: వరద ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా మణుగూరు బ్రిడ్జీ ప్రాంతాల్లో సహాయక చర్యలు చేయించారు. లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వరద బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస సహాయ కేంద్రాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

వర్ష ప్రభావిత ప్రాంతాలను మణుగూరు సీఐ ముత్యం రమేష్ సందర్శించి పరిశీలించారు. గోదావరి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలన్నారు.

పినపాక: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. బుధవారం భారీ వర్షాల నేపథ్యంలో మండలంలో పర్యటించిన రేగా పినపాక గ్రామంలో వాగు ఉధృతిని పరిశీలించారు. అధికారులు గ్రామాల్లోనే ఉండి సహాయక చర్యలు చేపట్టాలన్నారు.

గుండాల: మండలంలోని కిన్నెరసాని, మల్లన్న వాగులను బుధవారం ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి సందర్శించారు. గ్రామాల మధ్య వాగులు ఉంటే వాగుకు రెండు వైపులా బారికేట్లు ఏర్పాటు చేయాలని ఎస్సై రాజశేఖర్‌ను ఆదేశించారు. వాగులు తగ్గేంత వరకు పశువులను వాగుదాటి మేతకు తీసుకువెళ్లొద్దన్నారు. మండలాధికారులు అప్రమత్తంగా ఉండాలని వాగుల వద్ద సిబ్బందిని ఉంచాలని తెలిపారు.

బూర్గంపాడు: మండల పరిధిలోని మోతె, సారపాకలలోని వరద ప్రభావిత ప్రాంతాలను బుధవారం పాల్వంచ డీఎస్పీ వెంకటేష్ పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వరద పెరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట ఎస్సైలు రాజ్‌కుమార్, నాగబిక్షం ఉన్నారు.

గోదావరికి వరద పెరుగుతుండటంతో తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఎస్సైలు రాజ్‌కుమార్, నాగబిక్షం, ఎంపీడీఓ వివేక్‌రామ్, ఎంపీఓ సునీల్, ఏఓ శంకర్‌లు గోదావరి వరదలను పర్యవేక్షిస్తు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడ వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు.

అన్నపురెడ్డిపల్లి: అబ్బుగూడెం-కట్టుగూడెం గ్రామాల మధ్య ఉన్న ఎదులవాగు రహదారిపై వరద ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. వాగు ఉధృతిని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ పరిశీలించి, ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. డీఎస్పీ వెంట జూలూరుపాడు సీఐ శ్రీనివాస్, స్థానిక ఎస్సై షాహీన, గ్రామస్తులు కొత్తూరి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

దమ్మపేట: మండల కేంద్రంలో వరద నీటితో ముంచెత్తిన రాష్ట్రీయ రహదారిని, కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు బుధవారం పరిశీలించారు. దమ్మపేటలో ప్రభుత్వ పశు వైద్యశాల సమీపంలో రాష్ట్రీయ రహదారిపై వరద నీరు పోటెత్తగా, ఆ ప్రాంతాన్ని మాజీ ఎమ్మెల్యే తాటి పరిశీలించారు.



పినపాక: గ్రామంలో వాగు ఉధృతిని పరిశీలిస్తున్న రేగా కాంతారావు



బూర్గంపాడు: మోతె వద్ద ప్రజలకు సూచనలు చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్



గుండాల: కిన్నెరసాని వాగు ఉధృతిని పరిశీలిస్తున్న ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి



అన్నపురెడ్డిపల్లి: కట్టుగూడెం-అబ్బుగూడెం మధ్య వాగును పరిశీలిస్తున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్



దమ్మపేట: వరద నీటిలో మునిగిన రోడ్డును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే తాటి